## క్లుప్తంగా

### కేజీబీవీ విద్యార్థినులకు పరీక్ష అట్టల పంపిణీ



అట్టలు అందజేస్తున్న పడాల్‌దాస్, రమణ

దేవరాపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు దేవరాపల్లికి చెందిన రంది వెంకటరావు తన సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన పరీక్ష అట్టల(ప్లాంక్)ను పంపిణీ చేశారు. ఎంఈవో–1 బి.పడాల్‌దాస్,ఎంఈవో–2వి.ఉషారాణి, జిల్లా విజిలెన్స్‌అండ్‌మానెటరింగ్ కమిటీ సభ్యుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ప్రజాస్వామ్య పరిరక్షణ మండల అధ్యక్షుడు కొరుపోలు శ్రీను చేతుల మీదుగా 35 మంది టెన్త్ క్లాస్ విద్యార్థినులు, 50 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు అందజేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్. భువన మాధురి పాల్గొన్నారు.

### ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



కొవ్వూరులో గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: మండలంలోని కొవ్వూరులో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం పెద్ద ఎత్తున తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

గొలుగొండ: మండలంలోని జోగుంపేటలో శనివారం నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున తీర్థం నిర్వహించనున్నారు.

### ఎండీపీవో కార్యాలయ భవనానికి జోరుగా మరమ్మతులు



ఎంపీడీవో కార్యాలయ భవనంపై దెబ్బతిన్న గోడలను తొలగిస్తున్న కూలీలు

రోలుగుంట: స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనం మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈభవనం నిర్మించి 30 సంవత్సరాలు దాటడంతో గోడలు, శ్లాబ్ దెబ్బతిన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా కారిపోతోంది. దీంతో ఉద్యోగులు, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఎంపీపీ స్పందించి జనరల్ ఫండ్ నుంచి మరమ్మతు పనులకు నిధులు కేటాయించారు. ఆ నిధులతో పనులు జోరుగా సాగుతున్నాయి.

### రూ.50 లక్షలతో జిమ్

అనకాపల్లి : ఎన్టీఆర్ క్రీడామైదానంలో జిమ్ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ.50 లక్షలు విడుదలయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రూ.14లక్షల వ్యయంతో స్టేడియంలో గ్యాలరీలు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు.

# ఉత్తమ సేవలతో ప్రజల ఆదరాభిమానాలు పొందాలి



వలంటీర్లను సన్మానించి, అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కొత్తకోటలోమాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



బోయిలకింతాడలో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు

కె.కోటపాడు : సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని చౌడువాడ, ఆర్లి గ్రామ పంచాయతీల్లో సేవామిత్ర, సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శనివారం ఆయన సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఆకుల సాయి ప్రసాద్, సర్పంచ్ బోశం సందీప్, దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

**వలంటీర్ల సేవలు అమోఘం: ప్రభుత్వ విప్ ధర్మశ్రీ**

రావికమతం: గ్రామ వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు విజయవంతంగా అందుతున్నాయంటే వలంటీర్ల నిబద్ధతే కారణమన్నారు. సేవా వజ్ర, సేవా రత్న,సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు,ఉప సర్పంచ్ పందల దేవా,ఎంపీటీసీ పూడి దేవా తదితరులు పాల్గొన్నారు.



ఏఎల్ పురంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

**నిస్వార్థ సేవకులు వలంటీర్లు**

దేవరాపల్లి: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో క్షేత్ర స్థాయిలో నిస్వార్థంగా సేవలందిస్తూ వలంటీర్లు అందరి మన్ననలు పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబురావు అన్నారు. బోయిలకింతాడ సచివాలయం పరిధిలో ఉత్తమసేవలందించిన వలంటీర్లను శనివారం సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, ఎంఎల్‌వో అన్నం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఏఎల్ పురంలో...**

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లు గొంప గోవింద్, అడ్డాల ప్రశాంత్‌లను శనివారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లోచల సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి వలంటీర్లకు సన్మానాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని 394 మంది ఉత్తమ వలంటీర్లను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు సన్మానించనున్నట్టు ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. 19న వడ్డాది–1, వడ్డాది–2, లోపూడి, విజయరామరాజుపేట, పొట్టిదొరపాలెం, మంగళాపురం, కొమళ్లపూడి వలంటీర్లకు వడ్డాది సచివాలయంలో ఉదయం 10 గంటలకు సన్మానించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల నాయకుల చేతుల మీదుగా అవార్డులు అందిస్తామన్నారు. 20న బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కేపీ అగ్రహారం, కందిపూడి, పి.భీమవరం గ్రామాల వలంటీర్లకు బుచ్చెయ్యపేట సచివాలయంలో, 21న చింతపాక, పెదపూడి, పెదపూడి అగ్రహారం, గున్నెంపూడి, పెదమదీన గ్రామాల వలంటీర్ల చింతపాక సచివాలయంలో, 22న రాజాం, తురకలపూడి, ఆర్.శివరాంపురం, తైపురం, మల్లాం గ్రామాల వలంటీర్లకు రాజాం సచివాలయంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చేతుల మీదుగా అవార్డులు అందించి, సత్కరిస్తామన్నారు. ఆయా గ్రామాల వలంటీర్లు,నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

# రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు

ఎంపీడీవో జాగర్ల రాంబాబు

నాతవరం: మండలంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఎంపీడీవో జాగర్ల రాంబాబు తెలిపారు. నాతవరంలో గ్రామ జల సంఘాల కమిటీల సభ్యులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 31 గ్రామ పంచాయతీల్లో 39 గ్రామ జల సంఘాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన జల సంఘాల కమిటీల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా రూ.10 కోట్లతో తాగునీటి పనులు చేయించనున్నట్టు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసే బాధ్యత సంఘాలదేనన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయంగా జల సంఘాలు పని చేయాలని తెలిపారు. స్థానిక సర్పంచుల సూచనలు మేరకు జల సంఘాలు పని చేయాలన్నారు. అనంతరం జిల్లా కోఆర్డినేటరు సురేష్ వారికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వెలుగు ఏపీఎం మణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ జలసంఘాల కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జాగర్ల రాంబాబు

# నేడు పుష్పయాగం

కె.కోటపాడు : మండలంలో ఆర్.వై.అగ్రహారంలోని సీతారాముల సన్నిధిలో 1500 కిలోల వివిధ రకాల పువ్వులతో ఆదివారం పుష్పయాగం నిర్వహించనున్నట్టు గోవిందు రమణమూర్తి, నేమాని వెంకటేశ్వరశర్మ తెలిపారు. సింహాచలం దేవస్థానానికి చెందిన వేద పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

## 20న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

బుచ్చెయ్యపేట : మండలంలోని గున్నెంపూడి గ్రామంలో గ్రామదేవత తాళ్లమాంబ పండగ సందర్భంగా 20వ తేదీన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.100 రుసుం చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్ పోటీల్లో గెలిపొందిన మొదటి మూడు జట్లకు వరసగా రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6 వేల నగదు అందిస్తామని చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు

మాడుగుల రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ ఇన్‌చార్జి టి.నాగేశ్వరావు తెలిపారు. ప్రకృతి విధానంలో రైతులు పండించిన కూరగాయల స్టాళ్లను ముకుందపురం, మాడుగులలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్ల గురించి రైతులకు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌చార్జిలుతో పాటు సీఆర్పీలు పార్వతి, నాగేశ్వరావు, మోదినాయుడు, గోవిందమ్మ, లక్ష్మి తదితర్లు పాల్గొన్నారు.

# టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం: పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో అప్పారావు అన్నారు. బలిఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వార్షికోత్సవం నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు... విద్యార్థులను పర్యవేక్షిస్తూ వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. డిప్యూటీ డీఈవోను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, ఎంఈవో నాగేంద్ర పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం: 132 కేవీ సబ్ స్టేషన్ టవర్లు మరమ్మతుల కోసం ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. పెదబొడ్డేపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గబ్బాడ, బలిఘట్టం, రోలుగుంట, కోటవురట్ల, నాతవరం, గొలుగొండపేట, గొలుగొండ, ఏటిగైరంపేట, కృష్ణదేవిపేట, వెంకటాపురం, గన్నవరం, కొత్తకోట సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగుల ధర్నా

చోడవరం/ నర్సీపట్నం: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చోడ వరం, నర్సీపట్నాలలో ధర్నా చేశారు. ఈ ధర్నాల్లో జేఏసీ మండల అధ్యక్షుడు కె. సత్యనారాయణ, కార్యదర్శి డి.శేషుబాబు, కోశాధికారి పైడిరాజు, మైచర్ల మహాలక్ష్మినాయుడు, రమణమ్మ ,అసోసియేటెడ్ ప్రెసిడెంట్ యల్లా కృష్ణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 20 పోలింగ్ కేంద్రాల పరిశీలన



పైడిపాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీమోహన్



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

మాకవరపాలెం: మండలంలోని 20 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మురళీమోహన్‌రావు శనివారం పరిశీలించారు. పి.పి.అగ్రహారం, జంగాలపల్లి, మామిడిపాలెం, తూటిపాల, అప్పన్నదొరపాలెం, బూరుగుపాలెం, పైడిపాల, పెద్దిపాలెంతోపాటు పలు గ్రామాల్లో ఉన్న 20 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట డీటీ శంకర్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నాతవరం: అర్హత ఉన్న ప్రతి వ్యక్తిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అన్నారు. మండలంలో మర్రిపాలెం డి.యర్రవరం పంచాయతీలో శనివారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ హరి పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లు పూర్తి

కోటకోట : తీడ సచివాలయ పరిధిలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇచ్చిన స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు కార్యదర్శి ఎస్.రత్నం శనివారం తెలిపారు. 145 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

# శరవేగంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణం

నాతవరం: జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్టు బీఎస్ఎన్ఎల్ జేఈ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వల్సంపేట పంచాయతీలో కొత్తగా సెల్ టవర్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. టవర్ ఏర్పాటు చేసేందుకు కావలసిన రెవెన్యూ పరమైన రికార్డులను తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అందజేశారు.

పంచాయతీ తీర్మానం కాపీలను సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల శ్రీనివాస్ అందజేశారు. ఈసందర్భంగా జేఈ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 48 టవర్లలో ఇప్పటికే 25పైగా టవర్ల నిర్మాణం పూర్తి చేసినట్టు చెప్పారు. మిగతావి యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నాతవరం మండలంలో వల్సంపేట, బాపన్నపేట, చమ్మచింత గ్రామాలకు సెల్ టవర్లు మంజూరైనట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం స్థలాలను పరిశీలించి, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముందుగా వల్సంపేటలో టవర్ పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇట్టంశెట్టి శ్రీనువాస్, వీఆర్వో బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## 23న సంతోషిమాత తీర్థం

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం జంక్షన్‌లో ఈనెల 23న సంతోషిమాత అమ్మవారి తీర్థాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తీర్థం సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కబడ్డీ, సైక్లింగ్, ముగ్గుల పోటీలు, నిర్వహించనున్నట్టు తెలిపారు.